క్లుప్తంగా

పాఠ్యపుస్తకాల వితరణ



తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు కావలసిన ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలను పట్టణ వ్యాపారి షేక్ యాసిన్ శుక్రవారం వితరణ ఇచ్చారు. కళాశాల గ్రంథాలయంలో విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు కెమిస్ట్రీ అధ్యాపకుడు అప్పారావు తెలిపారు. కళాశాలలో విద్యార్థినులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో దాతలు సహకరించాలని హెచ్ఎం పీఎస్ఎన్‌రాజు కోరారు.

ఎంఈఓ-1గా శ్యాంసుందర్

తిరువూరు: తిరువూరు మండల విద్యాశాఖాధికారి-1గా మైలవరం జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం శ్యాంసుందర్ నియమితులయ్యారు. పూర్తి అదనపు బాధ్యతలపై ఆయనను తిరువూరు ఎంఈఓ-1గా నియమించారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జి.కొండూరు: మండలంలోని కుంటముక్కల, జి.కొండూరు విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో సాధారణ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్ రామ్మోహన్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

ముసుకుళ్ల(తిరువూరురూరల్): గొర్రెలు, మేకలను వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశుంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సాయిగోపాల్ సూచించారు. మండలంలోని ముసుకుళ్లలో గొర్రెలు, మేకల పెంపకందారులకు శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొట్టేళ్ల పెంపకం ద్వారా మంచి ఆదాయ మార్గాలున్నాయన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు వేయించాలని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రామారావు, కిషన్‌సింగ్, పశువైద్యాధికారులు అభిలాష్, శ్వేత, స్వప్న, షీలా పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకం

ఆగిరిపల్లి (నూజివీడు): మాదిగ రాజకీయ పోరాట సమితి నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడుకు చెందిన కలపాల జోజి మాదిగ నియమితులయ్యారు. సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ఆకుమర్తి చిన్నా మాదిగ చేతుల మీదుగా రాష్ట్ర ఇన్‌చార్జ్ కంబాల ప్రదీప్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

వ్యవసాయ సలహామండలి సమావేశం

విస్సన్నపేట: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం ఆ మండలి జిల్లా అధ్యక్షుడు దోర్నాల దామోదరరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. నష్టపోయిన మామిడి రైతులకు పరిహారం చెల్లించటం, వ్యవసాయ పరికరాలు, స్ప్రేర్స్ అందించాలని, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఏఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

ఏ.కొండూరు: మండలంలోని రామచంద్రాపురంలో జాతీయ రహదారికి గుంటలు ఏర్పడి వాహన చోదకుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వీరి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అట్లప్రగడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నరెడ్ల వీరారెడ్డి ముందుకు వచ్చి రూ. 40వేలు విలువ చేసే కంకరను వేయించినట్లు స్థానిక వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి తెలిపారు.

వైఎస్సార్ బీమా అందజేత

తాతకుంట్ల (విస్సన్నపేట): మండలంలోని తాతకుంట్ల పంచాయతీ మిట్టగూడెం గ్రామానికి చెందిన కట్టా సురేష్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందగా జగనన్న బీమా పథకం ద్వారా మట్టి ఖర్చుల కింద కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ.10 వేలు అందజేశారు. సర్పంచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బిల్లుల వసూలు కేంద్రం కొనసాగించాలి

తిరువూరు: విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు తిరువూరులో నిర్వహిస్తున్న కౌంటర్‌ను ఇక్కడే కొనసాగించాలని కోరుతూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీపురం విద్యుత్ ఏడీఈ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఇటీవల విద్యుత్ కార్యాలయాలకు సొంత భవనాలను లక్ష్మీపురం విద్యుత్ సబ్ స్టేషను ఆవరణలో నిర్మించడంతో కరెంటు బి ల్లుల వసూలు కేంద్రాన్ని అక్కడికి తరలించారు. ఈ కేంద్రాన్ని తిరువూరులోనే కొనసాగించాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వరరావు, భద్రం, నాగేంద్రప్రసాద్, రవి ఏడీఈ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

పథకాలు పొందేందుకు అర్హతే ప్రామాణికం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



వేల్పుచర్లలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

ముసునూరు: సంక్షేమ పథకాలు పొందడానికి అర్హతే ప్రామాణికం అని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన శుక్రవారం వేల్పుచర్లలో జగనన్న సురక్ష కార్యక్రమ గ్రామ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 783 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హులు సంక్షేమ పథకాలు నష్టపోకుండా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ ధ్రువపత్రాలు నేడు జగనన్న సురక్ష పథకంలో ఉచితంగా అందడం ప్రజల అదృష్టం అన్నారు. జగనన్న సురక్ష గ్రామ శిబిరం గుర్తుగా ప్రాంగణంలో అధికారులతో కలసి కొబ్బరి, మామిడి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, సర్పంచ్ మోహనరావు, ఉప సర్పంచ్ పి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగ వల్లేశ్వరరావు, ఎంపీడీఓ జి.రాణి, డీటీ ఎమిలీకుమారి పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: అర్హత కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తుమ్మగూడెం సచివాలయంలో నిర్వహించిన సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. వ్యయ ప్రయాసాలను భరిస్తూ వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువలేనివన్నా. అనంతరం 824 మందికి ఉచితంగా ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మారెమ్మ, మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు, తహసీల్దార్ విశ్వనాథరావు, ఎంపీడీఓ దుర్గా ప్రసాదు, పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు అందజేస్తున్న దేశిరెడ్డి



నూజివీడు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ సత్యనారాయణ

నూజివీడులో..

నూజివీడు: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని తొమ్మిదో వార్డు సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 464 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్‌రషీద్, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జంగంగూడెంలో..

నూజివీడు మండలంలోని జంగంగూడెంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ అంజనాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి ఎస్.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందకపోతే అర్జీలను అందజేసినట్లయితే సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పీఏ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

మండలంలోని సూరవరం సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ వీర వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి డీ వెంకటరత్నం మాట్లాడారు. అనంతరం 450 ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పీ శంకర్‌రావు, తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: ప్రజా సమస్యల పరిష్కరించేందుకే గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని గ్యామతండా, దీప్లా నగర్ తండాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన తండాల్లో అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారు ఇంకా ఉంటే ఆయా గ్రామాల్లోని వలంటీర్లు ద్వారా దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి వెంటనే మంజూరు చేస్తారన్నారు. ఈ తండాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వీరికి అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించి వారికి వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ తండాల్లో సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేసి, ట్రాక్టర్ల ద్వారా కృష్ణా జలాలు సరఫరా చేయించి తాగునీరు అందిస్తున్నామన్నారు. తండాలను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పర్వతనేని నాగమల్లేశ్వరి, జరబల జమలమ్మ, ఎంపీపీ నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, వైస్ ఎంపీపీ శివారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు చంద్రమోహనరావు, మండల యూత్ అధ్యక్షుడు చెన్నారావు తహసిల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు చర్యలు



నగరపంచాయతీ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

తిరువూరు: పట్టణంలో కృష్ణా నదీ జలాల సరఫరాకు చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా పలు ప్రాంతాల్లో పైపులైన్ల నిర్మాణానికి సీసీ రహదారులను పగులగొట్టడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నందున మరమ్మతులు చేయించనున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి హామీ ఇచ్చారు. శుక్రవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు రహదారుల మరమ్మతులకు చేసిన విజ్ఞప్తి మేరకు నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగిన వార్డుల్లో అభివృద్ధి పనులకు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున మంజూరైనట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఇప్పటివరకు రూ.2కోట్ల 54 లక్షల నిధుల వినియోగానికి అనుమతి వచ్చిందని పేర్కొన్నారు. నామినేషన్ ప్రాతిపదికన ఈ పనులు కేటాయిస్తామని తెలిపారు. పెరుగుతున్న జనాభా అవసరాలకనుగుణంగా 20మంది పారిశుద్ధ్య కార్మికులను అదనంగా నియమించడానికి ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రావిచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు

నూజివీడు: దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి యలమంద పేర్కొన్నారు. మండలంలోని దిగవల్లి, బోర్వంచ, పాతరావిచర్ల, రావిచర్లలో డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. వీటి నివారణకు ముఖ్యంగా దోమల వ్యాప్తిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే డెంగీ జ్వరం వ్యాప్తి చేసే దోమలు మంచినీటి నిల్వల్లో వృద్ధి చెందుతాయన్నారు. దీని నివారణకు గాను పరిసరాల్లో ప్లాస్టిక్ గ్లాసుల్లో, రోళ్లు, కొబ్బరి చిప్పల్లో, పాత టైర్ల ముక్కల్లో మంచినీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

చాట్రాయి: పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని కొండపల్లి ఐటీసీఎల్ అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ పిలుపునిచ్చారు. మండలంలోని చనుబండ హైస్కూల్లో స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.



విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఐటీసీఎల్ సిబ్బంది

నేడు 'జగనన్న సురక్ష'

తిరువూరురూరల్: మండలంలోని రెండు గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. మునుకుళ్ల, జీకొత్తూరు గ్రామాల్లో నిర్వహించనున్న కార్యక్రమాల్లో వివిధ పథకాలకు దరఖాస్తు చేసిన అర్జీదారులకు ధ్రువపత్రాలు జారీచేయనున్నట్లు పేర్కొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: విస్సన్నపేట 1, 3 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ శుక్రవారం తెలిపారు.

గృహాల నిర్మాణానికి ఆర్థిక సాయం

జి.కొండూరు: మండలంలోని కవులూరు గ్రామంలోని జగనన్న కాలనీలో పక్కా గృహాల నిర్మాణం చేపట్టిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు వారి కార్పొరేషన్ నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను పీఏసీఎస్ చైర్మన్ గొట్టిముక్కల ఓంకార్‌బాబు శనివారం అందజేశారు. ఓంకార్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ చొరవతో ఎస్టీ కార్పొరేషన్ నుంచి గృహనిర్మాణాల నిమిత్తం ఒక్కొక్కరికీ రూ.63 వేలు మంజూరు కాగా, మొదటి విడతగా రూ.23 వేల చొప్పున చెక్కులను అందజేసినట్లు చెప్పారు. మిగిలిన రూ.40 వేలను రెండు విడతలుగా అందజేస్తామని చెప్పారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

చంద్రాల(మైలవరం): రైతుల అభ్యున్నతే ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వ లక్ష్యం అని వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు పేర్కొన్నారు. మైలవరం మండలం చంద్రాల సచివాలయంలో సర్పంచ్ జ్యోతి అధ్యక్షతన శుక్రవారం రైతు అవగాహనా సదస్సు జరిగింది. గంగాధరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆలోచనలతో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సూచనలతో నియోజకవర్గంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో తక్కువ రేట్లకు నాణ్యమైన విత్తనాలు, మందులు సరఫరా జరుగుతోందని తెలిపారు. వ్యవసాయంలో రైతులకు ఎదురయ్యే పోషక లోపాలు స్పిక్ కంపెనీలో లభ్యమయ్యే ఉత్పాదనలను స్పిక్ అండ్ గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రతినిధులు వివరించారు. కంపెనీ సీనియర్ ఎక్జిక్యూటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ శివశంకర్, నదీమ్ అర్షద్, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మోడల్ విలేజ్ పనుల పరిశీలన



మోడల్ విలేజ్ పనులు పరిశీలిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ వెంకటమురళి

జూపూడి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ఘన, ద్రవ వనరుల నిర్వాహణ సంస్థ జూపూడిలో చేపట్టిన మోడల్ విలేజ్ పనులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జె.వెంకటమురళి శుక్రవారం పరిశీలించారు. స్వచ్ఛభారత్ ఘన ద్రవ వనరులు నిర్వహణ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శ్రీనివాసన్ చేపట్టిన ప్రాజెక్ట్ వివరాలు వివరించారు. డ్రెయినేజీల్లో మురుగునీరు బయటకు కనిపించకుండా అడుగున పారుదల అయి డ్రెయినేజీ పైన మొక్కలు పెంచుతామన్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపీపీ పాఠశాల, దాని పక్కన రెండు రోడ్లలో పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఘన ద్రవ వ్యర్థాల నిర్వాహణపై ప్రతి వీధిలో చేపడతామన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ గాంధీ, ఎంపీడీఓ రామకృష్ణనాయక్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన వారికి అభినందనలు



స్ఫూర్తి



ముబీనా



జీవన్



రాహుల్



వేల్పుల చరిత

తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఇరువురు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించినట్లు హెచ్ఎం సత్యనారాయణ రాజు తెలిపారు. పిట్టా స్ఫూర్తి, షేక్‌ముబీనాలు నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌లలో సీట్లు సాధించినందుకు వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరి ఎంపిక

కోకిలంపాడు(తిరువూరురూరల్): ట్రిపుల్ ఐటీ సీట్లకు తిరువూరు మండలం కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇరువురు విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్ఎం కేవీఎస్‌జీకే గుప్తా తెలిపారు. తమ పాఠశాలకు చెందిన కడారు జీవన్, పెరుమాళ్ల రాహుల్ ఒంగోలు క్యాంపస్‌లో పీయూసీ సీట్లు పొందారని తెలిపారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: గీతాంజలి హైస్కూలు విద్యార్థిని వేల్పుల చరిత ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గాదె మల్లికార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన చరితను ఉపాధ్యాయులు అభినందించారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి



లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మైలవరం: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు రెండు వారాలుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఎల్.బాలు పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు స్మార్ట్ టీవీ, బైజూస్ కంటెంట్, ఐఎఫ్‌పీస్ అనే అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీస్) మీద విద్యాభ్యాసం చేయడం, స్మార్ట్ బోర్డుల వాడకం, డిజిటల్ ఉపకరణాలు లోడ్ చేసి విద్యార్థులకు ఎలా బోధించాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ తరగతులకు ఏ.కొండూరు, రెడ్డిగూడెం మండలాల నుంచి వచ్చిన సుమారు 300 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాలు కళాశాల యాజమాన్యం, శిక్షణనిచ్చిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ఆగిరిపల్లి (నూజివీడు): మండలంలోని పోతవరప్పాడులో ఉన్న ఎస్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలలో హైస్కూళ్ల, యూపీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలు, బైజూస్ కంటెంట్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఎంఈఓ-2 ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో మారుతున్న ఆధునిక యుగానికి తగ్గట్లుగా బోధన సామర్థ్యాలను పెంపొందింపచేసేందుకు ప్రభుత్వం శిక్షణ తరగతులను నిర్వహిస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీ నాగభాస్కర్, ఎస్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ రమాదేవి, ఎ.రవికిరణ్, జీ శివనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా వైఎస్ జగన్ పాలన

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్

నూజివీడు: రాజకీయ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పాలనలో సమూల మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోకపోతే టీడీపీ, జనసేనలను ప్రజలే రాష్ట్రం నుంచి తరిమికొడతారని మండిపడ్డారు. కొందరు నాయకులు వలంటీర్ల మనోభావాలను దెబ్బతీసేవిధంగా మాట్లాడటం మంచిది కాదన్నారు. విశ్వసనీయత కలిగిన నాయకుడు సీఎం జగన్ అని, ప్రజలందరూ రాబోయే ఎన్నికల్లో ఆయనకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రాము, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, నాయకులు పామర్తి రాధాకృష్ణ పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి

చాట్రాయి: అంగన్‌వాడీ భవన నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయాలని నూజివీడు సీడీపీఓ నూరాని తెలిపారు. మండలంలోని పోతనపల్లి గ్రామంలో నాడు-నేడు పథకంలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ నాగేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసు పాల్గొన్నారు.

బాలుర హాస్టల్లో సబ్ కలెక్టర్ రాత్రి బస



ముసునూరు హాస్టల్లో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న నూజివీడు సబ్ కలెక్టర్

ముసునూరు: హాస్టల్ ప్రత్యేకాధికారి హోదాలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ శుక్రవారం రాత్రి ముసునూరులోని బీసీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. ముందుగా భోజనం చేస్తూ ఉన్న విద్యార్థులతో మాట్లాడి భోజన రుచి, శుచిపై ఆరా తీసి, వారితో కలసి భోజనం చేశారు. అనంతరం హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్, విద్యార్థులతో విద్యాభివృద్ధి, నడవడిక, ఆరోగ్య పరిస్థితులు, భోజనం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై ముఖాముఖి నిర్వహించారు. బాలురకు ప్రభుత్వం నుంచి అందవలసిన సౌకర్యాలు పూర్తిగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. భోజనం రుచికరంగా మెనూ ప్రకారం వండి, వడ్డించాలని వార్డెన్‌ను ఆదేశించారు. ప్రతి నెలా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. బాలుర హాజరు, హాస్టల్ రిజిస్టర్లు, ప్రాంగణాన్ని పరిశీలించి, పరిసరాల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధికారులతో కలసి విద్యార్థుల నడుమ రాత్రి నిద్రకు ఉపక్రమించారు. ఎంపీడీఓ జి.రాణి, వీఆర్ఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ సర్వీస్ సెంటర్లో విజిలెన్స్ అధికారుల దాడులు



విస్సన్నపేట: స్థానిక బిస్మిల్లా గ్యాస్ సర్వీస్ సెంటర్ నందు ఒక రీఫిల్లింగ్ మిషన్, రెండు రీఫిల్లింగ్ పిన్నులు 22 డొమెస్టిక్, ఐదు కమర్షియల్ సిలెండర్లు, ఐదు కేజీల సిలెండర్లు-8 సీజ్ చేసినట్లు పీడీఎస్ డీటీ శివనాగరాజు తెలిపారు. గృహ అవసరాలకు వాడాల్సిన గ్యాస్ సిలెండర్ నుంచి కమర్షియల్ సిలెండర్‌కు రీఫిల్లింగ్ జరుగుతుందని వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి విజిలెన్స్ ఎస్సై నాగేశ్వరరావుతో కలసి తనిఖీ చేసినట్లు పీడీఎస్ డీటీ పేర్కొన్నారు. సంబంధిత యజమాని మీద కేసు నమోదు చేయనున్నట్లు పీడీఎస్ డీటీ తెలిపారు.

పవర్‌లిఫ్టింగ్‌లో కృపారావుకు పసిడి పతకం



కృపారావును అభినందిస్తున్న శ్రీనివాసరెడ్డి

మైలవరం: ఆల్ ఇండియా ఇంటర్ రైల్వే పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలో ఎన్టీఆర్ జిల్లా జీ కొండూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సంకు కృపారావు పసిడి పతకం సాధించాడు. ఉత్తరాఖండ్‌లో ఈ నెల నాల్గో తేదీ నుంచి నాలుగు రోజుల పాటు పోటీలు జరిగినట్లు కోచ్ వై.రాజేష్ తెలిపారు. కృపారావు గతంలో కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో పసిడి పతకం సాధించాడు. 74 కిలోలు విభాగంలో జరిగిన స్క్వాడ్‌లో 312.5కిలోలు బెంచ్ ప్రెస్‌లో 152.5 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 315.5కిలోలు మొత్తం 782.5 కిలోలు బరువునెత్తి కృపారావు ఓవరాల్ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. కృపారావును మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎల్‌హెచ్‌ఆర్ ఫిట్‌నెస్ స్టూడియో కోచ్ వై.రాజేష్, దినేష్, వెంకటేశ్వరరావు అభినందించారు.